# అయ్యో..!

**ఐతా చంద్రయ్య**

(గత సంచిక తరువాయి భాగం)

"థాంక్యూ! దానికి ముందు మీరు ఈ రోజే రక్తపరీక్ష చేయించుకోవాలి" చిరునవ్వు.

"ఎందుకటా?" ముందున్న ఫైళ్లు పక్కకు జరిపాడు. "నా రక్తం గ్రూపు నాకు తెలుసు."

"అయినా... హెచ్.ఐ.వీ. పరీక్ష కోసం కంపల్సరీ చేయించుకోవాలి. ఎందుకంటే ఎయిడ్స్ భూతం ఏ మనిషిలో ఎప్పుడెలా ప్రవేశిస్తుందో చెప్పలేం. హెచ్.ఐ.వి. పాజిటివ్ వచ్చినవారి రక్తం ఎవ్వరికీ పనికి రాదు గదా! ఇదో తప్పనిసరి ఫార్మాలిటీ.. ఏమీ అనుకోవద్దు" చెయ్యందుకుని షేక్ హాండిచ్చాడు.

"సరే. రక్తపరీక్ష కోసం సాయంత్రం ఎక్కడికి రావాలి?"

"సాయంత్రం ఐదున్నరకు విమలా డయాగ్నిస్టిక్స్ సెంటర్‌కొచ్చి రక్తమిచ్చి వెళ్లండి. రిపోర్ట్ మేం కలెక్టు చేసుకుంటాం" లేచి నుంచున్నాడు.

"తప్పకుండా వస్తాను. ఇంట్లో ఒంటరిగానే ఉన్నాను. వెళ్లాలనే తొందర లేదు."

"ఎందుకలా?"

"నా భార్య మొదటి కాన్పుకు పుట్టింటికెళ్లింది."

"ఐతే తండ్రి కాబోతున్నారన్న మాటా. కంగ్రాట్స్!"

"తండ్రినయాను. పాప బారసాల కెళ్లొచ్చాను."

విమలా డయాగ్నిస్టిక్స్ సెంటర్లో రక్తమిస్తూంటే ఎంతో తృప్తిగా ఉంది.

మర్నాడు ఆదివారం. మధ్యతరగతి మంద హాసజీవులకు ఆటపట్టు. ఆలస్యంగా నిద్ర లేచిన సిటీ ఆవ్రలి

స్తోంది.

మనోవేగంతో వెళ్లి రక్తదాన శిబిరానికి ఏర్పాట్లు చేసుకోవాలనుకున్న వాసవి క్లబ్బు కార్యదర్శి వాయువేగంతో స్ప్లెండర్ బండెక్కి అశ్వవేగంతో ప్రయాణించాడు. శ్రీనివాస్ ఇంటిముందు దిగి హంస నడకతో లోపలికొచ్చాడు.

"ఓఫ్... మీరా! రండి. కూచోండి" సాదరంగా ఎదురొచ్చి స్వాగతం పలికాడు శ్రీనివాసు. "సారీ! ఒంటరివాణ్ణి గదా. చాయ గూడా ఆఫర్ చెయ్యలేకపోతున్నాను."

"పరవాలేదు. మీ బెటరాఫ్ లేరని చెప్పారు గదా!" సోషల్ సర్వీసంటే ఇలా గుండాలి. రక్తదానం గురించి గుర్తు చేసేందుకు స్వయంగా వచ్చాడు కార్యదర్శి.

"ఈ రోజు రక్తదానం చెయ్యాలని గుర్తుంది సార్! ఎప్పుడు ఎక్కడికి రావాలో చెప్పండి. నా బ్లడ్ రిపోర్టు కలెక్టు చేసుకున్నారు గదూ!" శ్రీనివాసులో ఉత్సాహం ఉరక లేస్తోంది. ఓ మంచి పని చెయ్యబోతున్నాననే ఆనందమది.

"రిపోర్ట్ వచ్చింది. మీకంత శ్రమ అవసరం లేదు." రిపోర్టు అందిస్తూంటే చేతులు వణికాయి. గొంతులో ఏదో అలజడి.

"శ్రమ ఏముంది సార్? పరోపకారం కోసమే శరీరమన్నారు గదా..." రిపోర్టు విప్పి చూశాడు. కళ్లు విశాలమైనాయి.

"ఆఁ... ఇదేమిటీ?" నెత్తి మీద నాగుంబాము పడ్డట్టు అదిరిపోయాడు. "రిపోర్టులో హెచ్ఐవి పాజిటివ్ అని వచ్చిందా?" హడలెత్తించింది.

"అవును సార్! బ్యాడ్ లక్ మై డియర్ ఫ్రెండ్!"

"అ...యి...తే న్నే...ను ఎయిడ్స్ రోగినన్నమాటా!" బుర్రలో భూగోళం గిర్రుగిర్రుమంటూంటే తల పట్టుక్కూచున్నాడు. నమ్మలేక రిపోర్టు కాయితాన్ని అటూ ఇటూ తిరగేసి చూశాడు. దాని మీద తన పేరే వుంది. నిజమే!

"సారీ! మీరంతగా కుంగిపోవాల్సిన అవసరం లేదు. ఈ రోజుల్లో ఎయిడ్స్ రోగులు మన దేశంలోనే ఎక్కువున్నారు. ఇది దైవ నిర్ణయం. మానవమాత్రులం మనమేమీ చెయ్యలేదు. కాబట్టి బాధపడాల్సిందేమీ లేదు సార్! ప్రశాంతంగా, నిశ్చింతగా ఉండాలి..." ఇంకేమేమో సముదాయించి వెళ్లిపోయాడు కార్యదర్శి.

సుడిగుండాల్లో చిక్కుకున్నట్టుంది.

ఏకపత్నీవ్రతుడిని గదా! పరస్త్రీని తల్లిగానో, చెల్లిగానో భావిస్తున్నాను గదా! ఈ ఎయిడ్స్ భూతం నన్నెట్లా ఆవరించిందో! జుట్టు పీక్కున్నాడు.

ఆ మధ్య చికెన్ గున్యా జ్వరం, ప్రభుత్వాసుపత్రిలో ఇంజెక్షన్లు... ఎయిడ్స్ రోగికి వాడిన సూది, నా రక్తాన్ని రుచి చూసిందేమో! సెలూన్‌లో షేవింగాయె. ఏ బ్లేడు



వాడారో ఏమో! అంతా నా దౌర్భాగ్యం.. భగవాన్ ఇప్పుడేం చెయ్యాలి?

ఆఫీసు హడావుడేమీ శ్రీనివాసు దృష్టి మరల్చలేకపోతోంది. మనిషిగా ఆఫీసు సూపర్వైజర్ కుర్చీలో కూచున్నా, మనసు తెర మీద మాయదారి దృశ్యాలు కదుల్తున్నాయి. ఫైళ్లు చచ్చిన పాముల్లా కనబడుతున్నాయి. 'నా ఆవేదన నెవరికి చెప్పుకోవాలి? ముద్దుల కూతురు కళ్ల ముందున్నా.. పసిదాన్ని లాలించలేని దుఃస్థితి, కట్టుకున్నదాన్ని ముట్టుకోలేని దౌర్భాగ్యం. రోహిణి ఎంత బాధ పడుతుందో! మరణం తప్ప మరో పరిష్కారం లేని రోగం గురించి చెబితే గుండె పగిలి నోరు తెరుస్తుంది. నా వింత ప్రవర్తన.. నిరాదరణ భరించలేదేమో! పాపతో సహా ఎటుపోయిందో! ఎన్ని బాధలు పడుతుందో! మొహమ్మీది రక్తమంతా ఇంకిపోయింది. బలవంతంగా ఫైలందుకోబోయాడు.

"సార్, మిమ్మల్ని ఆఫీసరుగారు రమ్మంటున్నారు" సుడిగాలిలా వచ్చి చెప్పిన అటెండరు కింది నుంచి మీద్దాకా చూసి పైరగాలిలా వెళ్లిపోయాడు.

సీట్లోంచి భారంగా లేచాడు శ్రీనివాసు.

0 0 0

"మందాకినీ! మీ స్నేహితురాలు మామూలు మూడ్‌లో కొచ్చినట్టేనా?" హస్పిటల్ డ్యూటీ ముగించుకుని వచ్చిన డాక్టర్ సూర్యనారాయణ, సాక్సు విప్పుకుంటూ భార్య నడిగాడు.

"పూర్తిగా రాలేదు గానీ విషయం చెప్పింది. పాపం! అది కాన్పుకెళ్లేప్పుడు భర్త ఆరోగ్యంగా, అన్యోన్యంగా ఉండే వాడట. పొత్తిళ్ల పాపతో పుట్టింటి నుండి వచ్చి నెల రోజులైనా అంటరాని మనిషిలా దూరదూరముంటున్నాడటా. వింత ప్రవర్తన ఎందుకంటే తప్పించుకుంటాడటా..." రోహిణి చెప్పిందంతా చెప్పేసింది.

పాపను నిద్ర బుచ్చి గదిలోంచి బయటికొచ్చింది రోహిణి.

నేరుగా మాట్లాడాలన్పించింది సూర్యనారాయణకు.

"రోహిణి గారూ! వారం తర్వాతన్నా విషయం చెప్పా రు. మీరెన్ని రోజులిక్కడున్నా మాకభ్యంతరం లేదు. మీ కభ్యంతరం లేకపోతే మీ భర్త వివరాలు చెప్పండి."

రోహిణి కళ్లల్లో బేలతనం.. మొహం ముడుచుకునుంది.

"ప్లీజ్ చెప్పు రోహిణీ!" చెయ్యి బట్టి సోఫాలో తన పక్కన కూచోబెట్టుకుంది మందాకిని. "నువ్వసలూ... ఇక్ష్వాకుల కాలంలో ఉండాల్సిన దానివే. ఈ రోజుల్లో ఆడదంటే అబల కాదు సబల. డిగ్రీదాకా చదువు వెలగబెట్టి నువ్వేమీ చలివిడి ముద్దలాగైపోయి ఆత్మస్థయిర్యం పోగొట్టుకుంటివి. ఆయనలా అడుగుతున్నారంటే కేవలం నీకేదన్నా సహాయం చెయ్యాలనే తల్లీ!" గదవ బట్టి బతిమాలింది.

ఆపదలో ఆదుకునేవారే అసలైన స్నేహితులు. స్నేహం నీడనిచ్చే చెట్టు లాంటిదంటారు. ఊపిరి పీల్చుకుంది రోహిణి. "మా వారి పేరు శ్రీనివాసు..." పేలవంగా నవ్వబోయింది.

"శ్రీనివాసా?" సూర్యనారాయణ కనురెప్పలు ఆశ్చర్యంగా పైకి లేచినై. "ఈ రోజు మా హస్పిటల్లో శ్రీనివాసనే ఎయిడ్స్ రోగి చనిపోయాడండీ! ఆయన కెవరూ లేరటా."

"హా...?" రోహిణి గుండె గుబేల్‌మంది. "అయితే మా ఆయనకు ఎయిడ్స్ సోకి ఉంటుంది. చెప్పలేక, ఏమీ చెయ్యలేక మథనపడ్డాడండీ!" వెర్రిగా నెత్తికొట్టుకుంది. బోర్‌మంది.



"అయ్యయ్యో! ఆ శ్రీనివాసే దీని భర్తా?" మందాకిని ఆందోళన. స్నేహితురాలు భుజాలు పట్టుకుని ఊరడిస్తోంది.

రోహిణి ఆవేదన, మందాకిని బాధ, డాక్టర్ సూర్యనారాయణ సానుభూతి... ఉన్న పళంగా అందరినీ హస్పిటల్ చేర్చి, మార్చురీలో శ్రీనివాసు శవం ముందుంచాయి. ఎగదన్నుకొస్తున్న ఎసరును పంటి బిగువున అదిమి పెట్టింది రోహిణి. పాపను మందాకిని కందించింది. ఊపిరి బిగపట్టి వణికే చేతులతో శవం మొహమ్మీది గుడ్డ తొలగించింది.

"ఆ... హా..!" కళ్లు కౌచిప్పలైపోయినై. మెదడు పొరల్లోని తుఫాను అయోమయంగా రూపాంతరం చెందుతూంటే, అవాక్కైపోయింది.

"ఏమైందే?" మందాకిని వెన్నులో సన్నని వణుకు.

"ఈ... ఈయన... మా ఆయన కాదే!" వెనక్కు జరిగింది.

"ఈయన వివరాలు మాక్కూడా తెలీవండీ! అపస్మారకస్థితిలో ఉన్నాయనను ఎవరో చేర్పించి పోయారు. పేరు మాత్రం శ్రీనివాసే" అని డాక్టర్ సూర్యనారాయణ, కేసు షీటు తెప్పించాడు.

అందులో హస్పిటల్ రక్తపరీక్ష రిపోర్టు ఉంది. హెచ్.ఐ.వి. పాజిటివ్ ఉంది. అంతా చూశారు.

రోహిణిని ఫోన్ నంబరడిగి అసలు శ్రీనివాసును పిలిపించాడు, డాక్టర్ సూర్యనారాయణ.

ఆఘమేఘాల మీద వచ్చినాయన "నన్నెందుకు రమ్మన్నారు సార్?" అడిగాడు తడబడుతూ. భర్త కనబడగానే రోహిణి ముఖారవిందం సహస్రదళాలుగా విచ్చుకుంది.

విషయమంతా వివరించి శవాన్ని చూపించాడు సూర్యనారాయణ. శ్రీనివాసు సందిగ్ధంలో పడిపోయాడు.

"మ్మ... మరి... నా రక్తపరీక్ష రిపోర్టు చూడండి" జేబు లోంచి రిపోర్టు తీసి డాక్టర్ కందించాడు.

చనిపోయిన శ్రీనివాసు కేసు షీట్లో, మరో రక్తపరీక్ష రిపోర్టు కనబడింది. అది విమలా డయోగ్నొస్టిక్స్ సెంటర్ వారిది. అందులో హెచ్.ఐ.వి. నెగెటివ్ ఉంది.

మూడు రిపోర్ట్సను వరుసగా ఉంచి చూశాడు, డాక్టర్ సూర్యనారాయణ. రెండు రిపోర్టులు విమలా డయోగ్నస్టిక్స్ సెంటర్ వాళ్లవి.

వెంటనే విమలా డయోగ్నొస్టిక్స్ సెంటర్‌కు ఫోన్ వెళ్లింది. లాబ్ అసిస్టెంటు వచ్చాడు. రక్తపరీక్షలన్నీ ఆయనే చేస్తాడక్కడ. విషయమంతా వివరించారు.

ఇద్దరు శ్రీనివాసుల రిపోర్టులు చూసి నాలిక్కరుచుకున్నాడు. రెండు ఒకే రోజువి. ఇద్దరి పేర్లూ ఒకటే.

"పరీక్ష సరిగానే చేశాం కానీ, రిపోర్టు ఒకరిదొకరి కందింది సార్" నీళ్లు నమిలాడు.

ల్యాబ్ అసిస్టెంటును నమలకుండా మింగెయ్యాలనిపించింది శ్రీనివాసుకు.

"సారీ రోహిణీ!" అంటూ పాపను అందుకున్నాడు.

"నా తల్లి... నా బంగారు కొండ...!" ఆత్రుతగా ముద్దాడాడు. ఆ తర్వాత వెయ్యి ఏనుగుల బలమొచ్చింది.

"రిపోర్టుల్లో పేర్ల ముందు ఇంటి పేర్లు రాస్తే ఇంతవరకొచ్చేది కాదు గదా! నేనే ఎయిడ్స్ రోగిననుకుని నరకయాతన ననుభవించాను. కదుల్తున్న శవంలా బతికానంటే నమ్మండి!" హాపీగా భార్య చెయ్యందుకున్నాడు.

"అయ్యారే... ఆశ్చర్యం...! అద్భుతం!" మందాకిని రోహిణి జడబట్టి లాగింది.

■